# అయ్యప్ప భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు

- రాష్ట్రంలో కాల్ సెంటర్
- శబరిమలైలో సమాచార కేంద్రం
- మంత్రి పొన్నాలతో ట్రావెన్‌కోర్ దేవస్థానం అధ్యక్షుడి భేటీ



**మంత్రి పొన్నాల లక్ష్మయ్యకు శబరిమల బ్రోచర్‌ను అందిస్తున్న ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు ఛైర్మన్ రాజగోపాల్‌నాయర్**

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్తున్న అయ్యప్ప భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం తగిన ఏర్పాట్లు చేస్తోందని దేవాదాయశాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. . గురువారం ట్రావెన్‌కోర్ దేవస్థానం అధ్యక్షుడు రాజగోపాల్ నాయర్ తన బృందం సభ్యులతో కలిసి సచివాలయంలో మంత్రి పొన్నాల లక్ష్మయ్య, దేవాదాయశాఖ కమిషనర్ బలరామయ్యతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుంచి శబరిమలైకు వెళ్తున్న భక్తులు, వారు పడుతున్న ఇబ్బందులు, ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం రాజ్‌గోపాల్ నాయర్‌తో కలిసి మంత్రి పొన్నాల మీడియాతో మాట్లాడారు. ఏటా మన రాష్ట్రం నుంచి శబరిమలైకు లక్షలాది భక్తులు వెళ్తున్నారన్నారు. వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పించేందుకు హైదరాబాద్‌లోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో ఈనెల 20వ తేదీ నుంచి జనవరి 20వ తేదీ వరకూ కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒక టోల్‌ఫ్రీ నంబరును నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. ఇందులో సహాయ కమిషనర్, ఇద్దరు సూపరింటెండెంట్‌లు, ఇద్దరు ఉద్యోగులు మూడు షిఫ్టుల్లో పనిచేస్తారని తెలిపారు. రాష్ట్రంలోని ఏ భక్తుడికి ఇబ్బంది ఏర్పడ్డా వెంటనే ఆయా ప్రాంతంలోని అధికారులకు సమాచారం అందించి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అదే విధంగా... ఈనెల 25వ తేదీ నుంచి జనవరి 25 వరకూ శబరిమలైలో తాత్కాలిక సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామనీ...ఇక్కడ ఆరుగురు అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వివరించారు. శాశ్వత ప్రాతిపదికన సమాచార కేంద్రం తదితర ఏర్పాట్ల కోసం అయిదు ఎకరాల స్థలం, అలాగే వాహనాల పార్కింగ్ కోసం మరో 20 ఎకరాల భూమిని ఇచ్చేందుకు కేరళ ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని అన్నారు. రాష్ట్రం నుంచి లక్షలాదిగా వెళ్తున్న భక్తులకు సౌకర్యాల కల్పనతోపాటు భవిష్యత్తులో ఇబ్బందులు పడకుండాఉండేందుకు ఈ వారంలో దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి రమాణాచారి, పోలీస్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజగోపాల్ నాయర్ మాట్లాడుతూ భక్తులకు శబరిమలైలో సౌకర్యాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా తగిన వసతులు కల్పించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు.